క్లుప్తంగా

గోవులకు దాణా వితరణ

తంబళ్లపల్లె: మల్లయ్యకొండపై భక్తులు ఆలయానికి ఇచ్చిన గోవులకు స్థానిక పశువైద్యశాల ఏడీ సుమిత్ర సొంత ఖర్చుతో రెండు క్వింటాళ్ళ దాణాను వితరణ చేశారు. శుక్రవారం అన్నదాన కమిటీ సభ్యులు నారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డిలకు దాణా అందజేశారు. ఏడీ సుమిత్ర దాతృత్వాన్ని వారు అభినందించారు.

నేటి నుంచి వాలీబాల్ టోర్నమెంట్

రామసముద్రం: దిగువపాళ్యెంకు చెందిన ఆనంద్‌బాబు (నాని) మొదటి వర్ధంతి సందర్భంగా శని, ఆదివారం వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం నుంచి టోర్నమెంట్ ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు రెండు రోజుల పాటు జరిగే పోటీలకు ఎంట్రీఫీజు రూ.716 లు చెల్లించాచి పాల్గొనవచ్చని తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.30 వేలు , రెండవ బహుమతి రూ.20 వేలు , మూడవ బహుమతి రూ.10 వేలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9346264708, 9966513141 నంబర్లను సంప్రదించాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ

పీలేరు : పీలేరు ప్రభుత్వాస్పత్రి గైనకాలజిస్టుగా డాక్టర్ శ్రీలత బాధ్యతలు స్వీకరించారు. రాజంపేట ప్రభుత్వాస్పత్రిలో సివిల్ సర్జన్‌గా పని చేస్తున్న ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో బాధ్యతలు స్వీకరించిన ఆమెకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్లు, వైద్య సిబ్బంది అభినందనలు తెలిపారు.

డాక్టర్ తేజస్వి..

తంబళ్లపల్లె: స్థానిక వైద్యవిధాన పరిషత్ ప్రభుత్వ ఆసుపత్రిలో గైనకాలజిస్టుగా డాక్టర్ తేజస్వి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె వైద్యవిద్య పూర్తి చేసి మొట్టమొదటగా పీహెచ్‌సీలో వైద్యురాలిగా చేరారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందించే అవకాశం కలగడం సంతోషంగా ఉందన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సకాలంలో వైద్యసేవలు అందిస్తానన్నారు.

గడువులోగా సర్వే పూర్తి చేయండి

గుర్రంకొండ: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో స్వామిత్ర సర్వేను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఎంపీడీఓ వెంకటేశులు అన్నారు. శుక్రవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వామిత్ర సర్వే అంటే ప్రతి సచివాలయ పరిధిలో ఉన్న గ్రామకంఠం భూములు గుర్తించడం అన్నారు. అలా గుర్తించిన భూములు, స్థలాలు ఎంతమేరకు ఉన్నాయో, వాటి సరిహద్దులు నిర్ణయించి పూర్తి స్థాయి సమాచారంతో కూడిన నివేదికన తమకు అందజేయాలన్నారు. సర్వేను పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సర్వేయర్లు కలిసి ఈనెల 15 నుంచి 17 తేదీలోగా పూర్తి చేయాలన్నారు. ఏఓ నాగశివారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు సుబ్బారెడ్డి, విశ్వనాథ్, మణికుమార్, నిస్సార్ అహ్మద్, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు విచారణ

పీలేరు : మండలంలోని బోడుమల్లువారిపల్లె పంచాయతీ దళితవాడకు చెందిన ఆర్. సత్యనారాయపై దాడి చేయడం తోపాటు కులంపేరుతో దూషించారని చేసిన ఫిర్యాదు మేరకు పీలేరు పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు అయింది. శుక్రవారం మదనపల్లె డీఎస్పీ సుధాకర్ బోడుమల్లువారిపల్లెకు చేరుకుని బాధితులతో మాట్లాడి గ్రామంలో విచారించారు.

అమ్మవారికి గోరింటాకుతో అలంకరణ

పెద్దతిప్పసముద్రం: ఆషాడమాసం సందర్భంగా ఆర్యవైశ్యులు స్థానిక వాసవీమాత ఆలయంలో శుక్రవారం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అమ్మవారికి గోరింటాకుతో చేసిన అలంకరణ చూపరులను ఆకట్టుకుంది.

ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన

డీఏఓ చంద్రానాయక్



మాట్లాడుతున్న డీఏఓ చంద్రానాయక్

మదనపల్లె : ఖరీఫ్–2023 సీజన్‌లో వర్షాభావ పరిస్థితులతో వేరుశనగ విత్తనాలు వేయలేకపోయిన రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించి, సాగుచేసేలా ప్రోత్సహించాలని ఆర్‌బీకే సిబ్బందికి డీఏఓ చంద్రానాయక్ ఆదేశించారు. అన్నమయ్యజిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో స్థానిక సీఎల్ఆర్‌సీ భవనంలో మదనపల్లె డివిజన్‌లోని ఆర్‌బీకే సిబ్బందికి సామర్థ్యపెంపులో భాగంగా ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలకు సంబంధించి మెరుగైన సేవలందించేందుకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఏఓ చంద్రానాయక్ మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలో సుమారు 60,000 మంది రైతులకు 52,000 క్వింటాళ్ల కే–6, నారాయణి రకం విత్తనకాయల పంపిణీని పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం వర్షాలు సకాలంలో కురవక వేరుశనగ పంట విత్తేందుకు కష్టంగా ఉందని రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వేరుశనగ విత్తేందుకు జూలై చివరి వరకు సమయం ఉందని, రైతులు వేచిచూడాలన్నారు. ఒకవేళ వర్షాలు కురవని పక్షంలో ప్రత్యామ్నాయపంటలైన కంది, చిరుధాన్యాలైన రాగి, కొర్ర, సజ్జలను రైతులు సాగుచేసేలా ఆర్‌బీకే సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వేరుశనగతో పోలిస్తే చిరుధాన్యాల సాగుకు పెట్టుబడిఖర్చులు, సాగుకాలం తక్కువ, దిగుబడులు అధికంగా ఉంటాయన్నారు. జిల్లాలో సాగు విస్తీర్ణం పెంచేందుకు, విరివిగా పండించేందుకు రైతులకు రెడ్‌గ్రామ్ విత్తనాలు(4కిలోలు కిట్) 1800 ప్యాకెట్ల వరకు ఉచితంగా పంపిణీ చేశామన్నారు. జిల్లాలోని ప్రతి ఆర్‌బీకేలో రైతులకు అవసరమైన అన్ని ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు. అలాగే జిల్లాలోని 400 ఆర్‌బీకేలలో కస్టమ్ హైరింగ్ సెంటర్స్ ఏర్పాటుతో వ్యవసాయానికి అవసరమైన ట్రాక్టర్స్, పరికరాలను అందుబాటులోకి తెచ్చామని, వీటిని స్థానికంగా ఉండే రైతులు వినియోగించుకునేలా ఆర్‌బీకే సిబ్బంది క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. సమావేశం తర్వాత పట్టణంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలను డీఏఓ చంద్రానాయక్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ శివశంకర్, కేవీకే సైంటిస్ట్ సోమశేఖర్‌బాబు, ఏడీఏ దీక్షాకుమారి, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే జిల్లా బహిష్కరణ

బి.కొత్తకోట: శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా భూ వివాదాలు సృష్టించి, కేసుల్లో నిందితులుగా ఉన్న వారిని జిల్లా బహిష్కరణ చేస్తామని మదనపల్లె డీఎస్పీ కే.కేశప్ప అన్నారు. శుక్రవారం సీఐ శివాంజనేయులు, ఎస్ఐ రామమోహన్‌తో కలిసి ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బి.కొత్తకోట మండలంలోని కోటావూరు పంచాయతీ కాండ్లమడుగులోని 1.80 ఎకరాల భూమికి సంబంధించి దాయాదులైన టి.నారాయణ, టి.చెన్నకేశవ కుటుంబాల మధ్య వివాదం ఉందన్నారు. గత ఫిబ్రవరిలో టి.నారాయణపై జరిగిన దాడిపై చెన్నకేశవ వర్గంపై హత్యాయత్నం కేసు నమోదుచేసి అరెస్ట్ చేయడం జరిందన్నారు. ఈ భూ వివాదం కోర్టుకు చేరగా, ఈనెల 9న టి.నారాయణ పోలంలో పంట సాగు చేసేందుకు ప్రయత్నించగా చెన్నకేశవ వర్గం అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరగడంతో ఇరువర్గాలకు చెందిన 16 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. కోర్టులో కేసు నడుస్తున్న భూమిలో ఎవరు ప్రవేశించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇరువర్గాలు కోర్టు ఉత్తర్వులు, పోలీసుల ఆదేశాలుంటేనే భూమిలోకి ప్రవేశించాలని, అలా కాకుండా శాంతిభద్రతల సమస్యను సృష్టిస్తే కఠిన చర్యలు తప్పని హెచ్చరించారు. ఇప్పటికే తహసీల్దార్ ఎదుట రూ.2లక్షల పూచికత్తుతో వీరిని బైండోవర్ చేశారు. మళ్లీ మదనపల్లె ఆర్డీఓ ఎదుట రూ.5లక్షల పూచికత్తుతో బైండోవర్ చేస్తున్నట్టు చెప్పారు. ఈ కేసుల ఆధారంగా ఘర్షణలు, శాంతిభద్రతల సమస్యను సృష్టిస్తున్న రెండు వర్గాలకు చెందిన 16 మందిపై రౌడీషీట్లు తెరుస్తున్నట్టు చెప్పారు.

శ్రీహరికోటకు 11 సర్వీసులు

పీలేరు రూరల్ : చంద్రయాన్–3 రాకెట్ లాంచింగ్ సందర్శన కోసం శ్రీహరికోటకు 11 ప్రత్యేక సర్వీసులు తరలివెళ్లినట్లు డీఎం కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి బస్సులకు పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు, కలికిరి, కోటపల్లె, భాకరాపేట నుంచి వివిధ కళాశాలలు, పాఠశాలల నుంచి విద్యార్థులు తరలివెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీఐ బాబునాయక్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ పద్ధతులు పాటించాలి

కలికిరి: రైతులు మామిడిలో పంట కోత అనంతరం సస్యరక్షణ పద్ధతులు తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు తెలిపారు. మండలంలోని టి.సండ్రావారిపల్లి గ్రామంలో మామిడి రైతులకు సస్యరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడిలో నాణ్యమైన దిగుబడులు సాధించడానికి కొమ్మల కత్తిరింపు, పచ్చిరొట్ట ఎరువుల వినియోగంతో నేల సారవంతమై వచ్చే పంటకు మేలు జరుగుతుందన్నారు. కొమ్మల కత్తిరింపుతో మొక్కకు పూర్తిగా సూర్యరశ్మి తగలడం వలన తేనెమంచు పురుగు దాడి నుంచి మొక్కను సంరక్షించుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి లక్ష్మీప్రసన్న, కేవీకే శాస్త్రవేత్తలు శ్రీనివాసులు, శ్రావణి, పీఎంఎఫ్ఎంఈ డీఆర్పీ గోవర్ధన్, ఏపిమాస్ ప్రాజెక్ట్ మేనేజరు భార్గవి, ఎఫ్‌పీఓ ప్రెసిడెంట్ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు షాహీనా, సర్పంచ్ జాహీదా పాల్గొన్నారు.

సంస్థకు మంచిపేరు తీసుకురావాలి

మదనపల్లె సిటీ: ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు తమ ఉద్యోగాలను ఇష్టపడి పని చేసి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం డిపోలోని ట్రైనింగ్ హాలులో సిబ్బందికి ప్రయాణికులతో ఎలా నడుచుకోవాలి, ఆదాయం ఎలా తీసుకురావాలన్న విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

నూతన తారలతో నాలుగుభాషల్లో సినిమా

– సినీ దర్శకుడు డాక్టర్ కరుణాకర్

మదనపల్లె : నూతన తారలతో నాలుగుభాషల్లో సినిమాను చిత్రీకరించనున్నట్లు సినీ దర్శకుడు డాక్టర్.కరుణాకర్ ఆరమడక తెలిపారు. గురువారం మంత్రి పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్న ఆయన త్వరలో జరగనున్న సినిమా పూజాకార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమన్, పోసాని కృష్ణమురళీ, తనికెళ్లభరణి, పుష్ప ఫేమ్ అజయ్‌ఘోష్ ప్రధాన తారాగణంగా, నూతన నటీనటులతో స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రాన్ని అన్నమయ్య, చిత్తూరు జిల్లాలో షూటింగ్ జరపనున్నట్లు తెలిపారు. రెండు షెడ్యూల్‌లలో రెగ్యులర్ షూటింగ్‌తో స్థానికంగా సినిమాను చిత్రీకరిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎంఎస్ఎంఈ డైరెక్టర్ ఆనందపార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు రక్ష.. జగనన్న సురక్ష



రామసముద్రం : ధ్రువ పత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ, సర్పంచ్



బి.కొత్తకోట: జగనన్న సురక్ష సభలో మాట్లాడుతున్న లక్ష్మీపతి

రామసముద్రం: పేదలకు రక్ష.. జగనన్న సురక్ష అని ఎంపీపీ కుసుమకుమారి , వైస్ ఎంపీపీ రమణారెడ్డి అన్నారు. శుక్రవారం మాలేనత్తం, ఎలవానెల్లూరు పంచాయతీల్లో సర్పంచ్‌లు శ్రీనాథరెడ్డి, ఉదయ్‌శంకర్‌రెడ్డిల సమక్షంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సురక్ష కార్యక్రమంలో దీర్ఘకాలంగా నిలిచిపోయిన సమస్యలను పరిష్కరించడంతో పాటు 11 రకాల సేవలను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. అలాగే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వలంటీర్లపై దిగజారుడు మాటలు మాట్లాడం తగదనాన్నారు. సింగిల్‌విండో చైర్మన్ కేశవరెడ్డి, మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, సచివాలయం మండల కన్వీనర్ నంద, మండల కన్వీనర్ భాస్కర్‌గౌడ్, ఎంపీటీసీ పద్మ, పార్వతమ్మ, ఎంపీడీఓ నారాయణస్వామి, తహసీల్దార్ దైవరాజన్, తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట: ప్రజలకు సమస్యలు లేని పాలనను ప్రభుత్వం అందిస్తోందని మదనపల్లె డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి లక్ష్మీపతి అన్నారు. శుక్రవారం మండలంలోని మొటుకుపల్లె పంచాయతీ పులుసుమానిపెంటలో జగనన్న సురక్ష సభను నిర్వహించారు. ఎంపీడీఓ శంకరయ్య, ఎంపీపీ లక్ష్మీనరసమ్మ, సర్పంచు సరస్వతమ్మ, ఉపసర్పంచు వేణుగోపాల్ రెడ్డి, ఎంపీటీసీ ఎ.గౌతమి, పాల్గొన్నారు.

ములకలచెరువు: జగనన్న సురక్ష ద్వారా అందించే ఉచిత సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు, సర్పంచు రాంబాబు, ఎంపీటీసీ మహేశ్వరి అన్నారు. శుక్రవారం మండలంలోని చౌడసముద్రంలో లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. దరఖాస్తు చేసుకున్న వారికి ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ గోర రవీంద్రారెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ రెడ్డిబాషా, నాయకులు క్రిష్టారెడ్డి, మహదేవరెడ్డి, రెడ్డెప్ప ఉన్నారు.

తంబళ్లపల్లె: జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు వరమని స్పెషల్ ఆఫీసర్ జిల్లా అధికారి సందప్ప తెలిపారు. శుక్రవారం కొటాల సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, సర్పంచులు సహదేవరెడ్డి, చెన్నకేశవరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో సురేంద్రనాథ్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, కోటిరెడ్డి, కుమారమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె : పేద, బడుగు, బలహీనవర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని సొసైటీకాలనీ రామాలయంలో సొసైటీకాలనీ–1,2, అమ్మినేనివీధి, ఇందిరానగర్ ఉర్దూపాఠశాలలో ఇందిరానగర్, దొంతిలేఅవుట్, కృష్ణానగర్ సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చైర్‌పర్సన్ మనూజారెడ్డి మాట్లాడుతూ.. పేద ప్రజలు జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ నూర్‌ఆజం, కౌన్సిలర్లు గిరిజా, ఆర్.వి.శివారెడ్డి, ఈశ్వర్‌నాయక్, ఎస్వీ.రమణ, రాజేష్, జేసీకే ఇన్‌చార్జ్ మునిశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం: పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందిస్తూ పాలనలో సమూల మార్పులు తీసుకొచ్చిన ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శమని ప్రజా ప్రతినిధులు, నాయకులు మహమూద్, శివన్న, డ్రిప్ రమణ, మంజునాథ్ రెడ్డి, రవికుమార్, సుబ్రమణ్యం రెడ్డిలు అన్నారు. శుక్రవారం మండలంలోని నవాబుకోటలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో అర్హులందరికీ వంద శాతం పథకాలు అందించడమే తమ లక్ష్యమని ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి, తహశీల్దార్ విద్యాసాగర్‌లు అన్నారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువ పత్రాలు అందజేశారు.



కుటుంబ సభ్యుడిలా సేవలు..

నిమ్మనపల్లె పంచాయతీ పెద్దమాదిగపల్లెకు చెందిన వలంటీర్ వెంకటేష్ తన పరిధిలోని 50 కుటుంబాలకు నిస్వార్థంగా సేవలందిస్తున్నాడు. స్థానిక నివాసి డయాలసిస్ పేషంట్ ఆదినారాయణ గత ఫిబ్రవరిలో అనారోగ్యానికి గురై చిత్తూరు అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందాడు. ఈ సమయంలో పింఛన్ తీసుకునేందుకు నిమ్మనపల్లెకు రాలేకపోయాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ వెంకటేష్ చిత్తూరుకు వెళ్లి పింఛన్ అందజేశాడు. పింఛన్ పొందలేనన్న దిగులుతో ఉన్న సమయంలో వలంటీర్ వచ్చి పెన్షన్ రూ. 10వేలు చేతికి అందించి ధైర్యం చెప్పాడు . **- నిమ్మనపల్లె**



డయాలసిస్ రోగి ఆదినారాయణకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ వెంకటేష్

కష్టాల్లో అండగా..



వలంటీర్ వెంకటేష్ గ్రామంలోని అందరితో సఖ్యతగా ఉంటూ ఎవరికి ఏ కష్టం వచ్చినా అందుబాటులో ఉండటమే కాకుండా తనవంతు సాయం చేస్తుంటాడు. అతడు చేసిన మంచికి అతడిని పొగిడితే.. ఇది తన గొప్ప కాదని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మీ లాంటి వాళ్లకు సేవచేసేందుకు తమకు కల్పించిన అవకాశమని చెప్పాడు. మా లాంటి వాళ్ల బాగోగులకు ఒక మనిషిని పెట్టిన సీఎంకు ధన్యవాదాలు. **- ఆదినారాయణ, నిమ్మనపల్లె**

హైదరాబాద్ వెళ్లి ఈకేవైసీ..

ఈ చిత్రంలో బయోమెట్రిక్ తీసుకుంటున్న గ్రామ వలంటీరు పేరు శేషుకుమార్. కేవీపల్లె మండలం తిమ్మాపురం గ్రామ సచివాలయం పరిధిలో మహల్‌క్రాస్‌లో గ్రామ వలంటీరుగా ఉన్న కె. శేషుకుమార్ కరోనా సమయంలో విశేష సేవలందించి ప్రశంసలు అందుకున్నాడు. రేషన్ కార్డులో పేర్లు చేర్చడానికి హైదరాబాద్‌కు వెళ్లి ఈకేవైసీ చేపించాడు. అలాగే సుదూర ప్రాంతాలకు వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్నాడు. కరోనా సమయంలో ప్రజలకు అందుబాటులో ఉండే అవగాహన కల్పించడం, గ్రామంలో శ్యానిటేషన్ చేపించడంలో చురుకైన పాత్ర పోషించి శభాష్ అనిపించుకున్నాడు. **- కేవీపల్లె**



ఈకేవైసీ చేస్తున్న వలంటీరు కె. శేషుకుమార్

వలంటీర్ సేవలు మరువలేనివి



ఇంజినీరింగ్ పూర్తి చేసి జాబ్ సెర్చింగ్ కోసం హైదరాబాద్ వెళ్లాను. అప్పుడే కరోనా ప్రభావం ఎక్కువై ప్రజలు ఎక్కడికీ తిరగలేని పరిస్థితి. ఇలాంటి తరుణంలో రేషన్‌కార్డులో నా పేరు చేర్చడానికి ఈకేవైసీ చేసేందుకు మా గ్రామ వలంటీరు హైదరాబాద్‌కు వచ్చాడు. ఆయన కృషితోనే నాపేరు రేషన్ కార్డు నందు నమోదైంది. వలంటీరు సేవలు మరువలేనివి.**- బి. గురునాథ**

వృద్ధులకు ఎంతో సాయం..

కరోనా లాక్‌డౌన్ సమయంలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. వాల్మీకిపురం గ్రామ సచివాలయ పరిధిలో వలంటీర్ లక్ష్మి ప్రసన్న ప్రభుత్వ పథకాలు అందించటంతో పాటు తన పరిధిలోని 50 పేద కుటుంబాలకు సాయం చేసింది. ఈమె సేవకు నాలుగేళ్లుగా ప్రభుత్వం సేవా మిత్ర అవార్డును అందించింది. ప్రతి నెలా 1వ తేదీ వచ్చిందంటే ఆ రోజు సాయంత్రానికే ఎవరు ఎక్కడున్నా పింఛన్ అందించడం బాధ్యతగా తీసుకుంటుంది.

- వాల్మీకిపురం



వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ లక్ష్మి ప్రసన్న

వలంటీర్ల ర్యాలీ, రాస్తారోకో

బి.కొత్తకోట: వలంటీర్ల సేవలపై పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం బి.కొత్తకోటలో రాస్తారోకో నిర్వహించారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయం నుంచి బైపాస్‌రోడ్డు, రంగసముద్రం రోడ్డు మీదుగా జ్యోతిచౌక్ చేరుకుని వలంటీర్లు పవన్‌కళ్యాణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జ్యోతిచౌక్‌లో రోడ్డుపై రాస్తారోకో చేశారు. గౌరవ వేతనంతో సేవ చేస్తున్న తమపై పవన్‌కళ్యాణ్ రాజకీయ కారణాలతో చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని, లేదంటే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయాల కోసం తమను వాడుకోవడం, తాము చేస్తున్న సేవలపై ప్రజల్లో అనుమానాలు రెకెత్తించేలా ఆరోపణలు చేయడం తగదని వలంటీర్లు పేర్కొన్నారు. వలంటీర్లను రాజకీయాలను అతీతంగా చూడాలని కోరారు. కోవిడ్, ఇతరా సమయాల్లో ప్రజలకు, అధికారులకు మధ్య వారధిలా నిలబడి సేవలు అందించామన్నారు. కార్యక్రమంలో వలంటీర్ల ప్రతినిధులు ఎం.మంజునాథరెడ్డి, ఫయాజ్, మనోజ్‌కుమార్‌రెడ్డి, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 18 మంది ఎంపిక

వాల్మీకిపురం: స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన జాబ్ మేళాలో 18 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ క్రిష్ణమూర్తి తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఎంఎస్ఎన్ ల్యాబరేటరీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ క్రిష్ణమూర్తి మాట్లాడుతూ డిగ్రీ విద్యార్థులు పది మంది, ఇంటర్ విద్యార్థులు ఎనిమిది మంది ఎంపిక వ్వడం అభినందనీయమన్నారు.

24 మంది ఉద్యోగాలకు ఎంపిక

ములకలచెరువు: మండలంలోని బ్లాసం డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన బ్లూడార్ట్ ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులతో జాబ్‌మేళా నిర్వహించారు. డిగ్రీ విద్యార్హత కలిగిన 75 మంది నిరుద్యోగులు పాల్గొనగా 24 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ రామ్‌కుమార్ తెలిపారు.

300 మందికి ఉచిత వైద్య పరీక్షలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని యంగ్ ఇండియా సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సరిహద్దు కర్ణాటక రాష్ట్రంలోని చేలూరు ప్రభుత్వాసుపత్రిలో 300 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. బెంగళూరులోని ఎంవీజే ఆసుపత్రికి చెందిన 40 మంది వైద్య బృందం ఉచిత మైగా శిబిరంలో పాల్గొని వైద్య సేవలు అందించి మందులను పంపిణీ చేశారు. సేవా సంస్థ అధ్యక్షుడు రాజశేఖర్‌తో పాటు డాక్టర్ గౌతమ్, క్యాంప్ ఆర్గనైజర్లు అమరేష్, శ్రీనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టు రోగులను గుర్తించాలి

కేవీపల్లె : కుష్టు రోగులను గుర్తించడంలో ఆరోగ్య సిబ్బంది చురుగ్గా వ్యవహరించాలని జిల్లా పారా మెడికల్ అధికారి రవికుమార్‌నాయక్ అన్నారు. శుక్రవారం గర్నిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం గర్నిమిట్ట, కేవీపల్లెలో కుష్టు వ్యాధి గ్రస్తుల గుర్తింపు సర్వే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధి అనుమానితులను గుర్తించడంలో ఆశా కార్యకర్తల పాత్ర చాలా కీలకమైందని తెలిపారు.